చెరవులు, కాలువల

మరమ్మతులకు ప్రతిపాదనలు

కోతకు గురైన కాలువలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ

అశ్వారావుపేట, డిసెంబర్ 9: మిగ్‌జాం తుపాను తాకిడికి డివిజన్‌లో దెబ్బతిన్న చెరువు కట్టలు, కాలువల తక్షణ మరమ్మతులకు రూ.20 లక్షలతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఇరిగేషన్ ఈఈ సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన అశ్వారావుపేట, గుమ్మడవల్లి గ్రామాల్లో పర్యటించి వెంకమ్మ చెరువు, గుండేటి వాగు, పెదవాగు ప్రాజెక్టులను పరిశీలించారు. కోతకు గురైన ప్రాంతాల్లో త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు. ఆయన వెంట అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, డీఈఈ ఎల్ కృష్ణ, ఏఈఈ కేఎన్‌బీ కృష్ణ ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 9: మల్లాయిగూడెం, పండువారిగూడెం, దిబ్బగూడెంలో మిగ్‌జాం తుపాన్ తాకిడికి దెబ్బతిన్న పంటలను శనివారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ

మణికంఠను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 9: కొత్తగూడెం వీహెచ్‌పీ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలో లక్ష్మీదేవిపల్లి త్రివేణి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్ఎన్వీఎన్ సాయిమణికంఠ ద్వితీయ స్థానంలో నిలిచాడు. విద్యార్థిని పాఠశాలల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీశ్, సీఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌సింగ్, వైవీ సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య అభినందించారు.

శ్రీరాగా విద్యార్థులూ..

కొత్తగూడెం వీహెచ్‌పీ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలో జిల్లాకేంద్రంలోని శ్రీరాగా ప్లే స్కేల్ విద్యార్థులు హేమంత్, సాయిప్రఖ్యాత్, ప్రనూజ, పునిశ్, మనస్విని, సాయిత్రైలోక్య, జాన్విక, ఎండీ మహిరా, రితిక, యువన్ సాయి, హిమాన్ష ప్రతిభకనబరిచి బహుమతులు సాధించారు. వీరిని శనివారం కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవిత అభినందించారు.

రేపు ప్రజావాణి

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 9: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు సకాలంలో కలెక్టరేట్‌లో హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరు కావొద్దని, అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లవద్దని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 9: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం నిర్వాహకులు 80 మంది మాలధారులకు భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులు శబరి మలైకి పయనమయ్యారు.

బిడ్జి సెంటర్‌లో స్వాగత ద్వారం

రామాలయంలో చలువ పందిరి

నదీ హారతి ఇస్తున్న అర్చకులు

ముక్కోటికి ముస్తాబవుతున్న భద్రగిరి

భద్రాచలం, డిసెంబర్ 9: భద్రాచలం రామయ్య దివ్యక్షేత్రంలో ఈ నెల 13 నుంచి జనవరి 2 వరకు జరుగనున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు. ఈ నెల 22న జరిగే తెప్పోత్సవం, 23న జరిగే ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు ఆలయ అధికారులు రూ.కోటి నిధులతో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు సంబంధించిన పనులు చకాచకా సాగుతున్నాయి. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్, పార్కు, చర్ల రోడ్డులో ఇప్పటికే స్వాగత ద్వారాలు స్వాగతం పలుకుతున్నాయి. సిబ్బంది, కూలీలు ఆలయానికి రంగులు వేస్తున్నారు. గోపురానికి విద్యుద్దీపాలు అమరుస్తున్నారు.

ముక్కోటి ఉత్సవాలకు రండి..

భద్రాచలంలో ఈ నెల 13 నుంచి ప్రారంభంకానున్న ముక్కోటి అధ్యయనోత్సవాలతో పాటు 22న జరిగే తెప్పోత్సవం, 23న జరిగే ఉత్తర ద్వార దర్శన వేడుకలకు ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అధికారులు శనివారం హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆహ్వాన పత్రిక అందించారు. అర్చకులు ఆయన్ను సత్కరించి, వేదాశీర్వచనం అందజేశారు. భద్రాద్రి రామయ్య ప్రసాదాలు అందజేశారు. అలాగే గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఇతర మంత్రులకూ ఆహ్వాన పత్రికలు అందజేస్తామని ఈవో తెలిపారు.

గోదావరి మాతకు నదీ హారతి

కార్తీక ద్వాదశి శనివారాన్ని పురస్కరించుకొని సాయంత్రం అర్చకులు గోదావరి మాతకు నదీ హారతి ఇచ్చారు. నదీ మాతకు పసుపు, కుంకుమ, గాజులు, సారె సమర్పించారు. అనంతరం గోదావరి మాతకు ధూప హారతి, ఏక హారతి, నేత్ర హారతి, బిల్వ హారతి, నాగ హారతి, పంచ హారతి, నంది హారతి, సింహ హారతి సమర్పించారు.

నేడు భద్రాద్రిరామయ్యను దర్శించుకోనున్న మంత్రులు

భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకోనున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో పాల్గొంటారు.

మంత్రి పొంగులేటితో ఆలయ అధికారులు

కేటీఆర్‌ను కలిసిన

మాజీ ఎమ్మెల్యే మెచ్చా

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. – దమ్మపేట రూరల్, డిసెంబర్ 9

మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు, డిసెంబర్ 9: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

'మహాలక్ష్మి' ప్రయాణం షురూ



ఇల్లెందు: బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారి

ఇల్లెందు, డిసెంబర్ 9: మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం శనివారం ప్రారంభమైంది. ఇల్లెందు బస్టాండ్‌లో ప్రత్యేక అధికారి డాక్టర్ మాధురి జెండా ఊపి బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుందన్నారు. వారం వరకు ఎలాంటి గుర్తింపు కార్డులేకున్నా ప్రయాణం చేసే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు బీఎస్ రాణి, కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియేలు, తాటి భిక్షం, పులి సైదులు, ధనుంజయ్, జాఫర్, ఆరెం కిరణ్, ఈసం నర్సింహారావు, శ్రీధర్, మెట్ల కృష్ణ, సైదేమియా పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ, డిసెంబర్ 9: పాల్వంచ పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ అధికారులు 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల రంగారావు, గంగాధర్, బత్తుల వెంకటేశ్వరరావు, కొండం వెంకన్న గౌడ్, కొర్రాజుల విజయ్, షేక్ చాంద్‌పాషా, లక్ష్మీరెడ్డి, సుజాత, కరట్టా సోమయ్య పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు కేటాయించండి

చంద్రుగొండ, డిసెంబర్ 9: ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొత్తగూడెం డిపో నుంచి చంద్రుగొండ మీదుగా ఖమ్మం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని సీపీఎం మండల కమిటీ నాయకులు శనివారం కొత్తగూడెంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. కొత్తగూడెం నుంచి సుజాతనగర్, రాఘవపురం, తుంగారం మీదుగా చంద్రుగొండ వరకు మరో సర్వీసును నడపాలన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుక

ఖమ్మం, డిసెంబర్ 9 : కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆశీస్సులతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమపాలన అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి అన్నారు. సోనియా జన్మదినం సందర్భంగా శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నాయకులు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు మద్ది మల్లారెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, గుమ్మా రోశయ్య, కొంగర జ్యోతిర్మయి, మద్ది కిశోర్‌రెడ్డి, అజ్మీరా అశోక్‌నాయక్, ఏనుగు వెంకటరెడ్డి, కీసర పద్మజా రెడ్డి, శ్రీకళా రెడ్డి, కొత్తపల్లి సరిత, చంద్రూనాయక్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పరమేశ్వరుడికి జలాభిషేకం

చుంచుపల్లి, డిసెంబర్ 9: కార్తీక మాసం సందర్భంగా గౌతంపూర్ పంచాయతీ పరిధిలోని సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలోని రామలింగేశ్వరస్వామి లింగానికి శనివారం భక్తులు 108 కలశాలతో జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారిని అభిషేకించారు.

వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేట, డిసెంబర్ 9: వివాహితపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై శనివారం అశ్వారావుపేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లో నిద్రిస్తుండగా శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన హాలావత్ శశికుమార్ అనే వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. బాధిత మహిళ కేకలు వేయడంతో శశికుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

17న 'భలే మంచిరోజు'

ఖమ్మం, డిసెంబర్ 9 : అమరగాయకుడు ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని సుధాస్ ఎంటర్‌టైన్మెంట్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే 'భలే మంచి రోజు' సినీ సంగీత విభావరిని జయప్రదం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.వాసుదేవ్, శరగోపం సుదర్శన్ కోరారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ మొదటి ఆదివారం రోజున భలే మంచిరోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాంగం విజయసారథి, ఎస్‌వీ రమణ, మహ్మద్ జాన్‌సాహెబ్ పాల్గొన్నారు.